క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం



పూజా కార్యక్రమాల్లో యల్లపు ప్రసాద్, చంద్రకళ, తదితరులు

అల్లిపురం: భూపేష్‌నగర్ దరి, బౌడ రారోడ్డులోని శ్రీలక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుడు బులుసు రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, అనంతరం అలంకరణ చేశారు. భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో యల్లపు ప్రసాద్, చంద్రకళ దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

మోదీ హ్యాట్రిక్ విజయంపై హర్షం



కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న సంఘం సభ్యులు

దాబాగార్డెన్స్ : మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టనున్న సందర్భాన్ని పురస్కరించుకుని నగరంలోని దండుబజార్ సమీపాన గల అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం వేడుకలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు దాడి సత్యనారాయణ, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పెబ్బిలి రవికుమార్ నేతృత్వంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఎర్నేటి తాతారావు, చిత్రాడ అప్పారావు, పేరూరి గణేష్, ఎర్నేటి సన్యాసిరావు, తెలికిల శ్రీనివాస్, దాడి లక్ష్మణకుమార్, వేంకటేష్, జామి సత్యనారాయణ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహానికి ఆధునిక హంగులు



ఆధునికీకరించిన మరుగుదొడ్ల బ్లాక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని ఎస్సీ సంక్షేమ బాలురు వసతి గృహానికి ఆధునిక హంగులు సమకూర్చారు. రూ.38 లక్షల సీఎస్సార్ నిధులతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ పనులు జరిగాయి. 100 మంది విద్యార్థులు ఈ వసతి గృహంలో ఉండటంతో అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించారు. ఈ నేపథ్యంలో బుధవారం కలెక్టర్ మల్లికార్జున ఆయా పనులు జరిగిన తీరును పరిశీలించారు. వసతి గృహానికి పూర్తిస్థాయి మరమ్మతులతో పాటు మరుగుదొడ్ల నిర్మాణం, పెయింటింగ్ పనులు చేపట్టారు. ఆయా పనులను కలెక్టర్ పరిశీలించి, విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు.

తీరం అల్లకల్లోలం



మంగమారిపేట బీచ్ వద్ద ఎగసిపడుతున్న కెరటాలు

కొమ్మాది : భీమిలి బీచ్ రోడ్డు తీర ప్రాంతం బుధవారం సాయంత్రం ఒక్కసారిగా అల్లకల్లోలంగా మారింది. చినుకులతో ప్రారంభమై ఈదురు గాలులతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రుషికొండ, సాగర్‌నగర్, మంగమారిపేట తీర ప్రాంతాల్లో ఉధృతంగా అలలు ఎగసిపడ్డాయి. రుషికొండ తీర ప్రాంతంలో అలలు ఎగసిపడుతున్న నేపథ్యంలో పర్యాటకులను లైఫ్‌గార్డ్స్ ఎక్కడికక్కడ అప్రమత్తం చేశారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ



పాపాహోంలో మొక్క నాటుతున్న బీవీపీ ప్రతినిధులు

అల్లిపురం: పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత అని పాపాహోం అధ్యక్షుడు డి.సూర్యప్రకాష్ అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారత్ వికాష్ పరిషత్ విశాఖపట్నం శాఖ, బీవీపీ ఝాన్సీ లక్ష్మీబాయి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పాపాహోంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బీవీపీ జాతీయ స్థాయి పర్యావరణ పరిరక్షణ చైర్మన్ రమేష్ చంద్ జైన్, ప్రాంతీయ స్థాయి ప్రతినిధి ఎంవీవీ సత్యనారాయణ, బీవీపీ రాష్ట్ర స్థాయి మీడియా ఇన్‌చార్జ్ ఎంవీ రాజశేఖర్‌తో కలిసి పాపాహోం ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. అనంతరం సూర్యప్రకాష్ మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా ప్రాణవాయువును, ఆయుస్సును పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బీవీపీ విశాఖ ప్రతినిధులు సత్యనారాయణ, భాస్కరరావు, మాణిక్యాలరావు, నిర్మలాదేవి, కమల, పట్టాభిరామయ్య, వనజ, సురేష్, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.



ఎంజీఎం హైస్కూల్‌లో మొక్క నాటుతున్న పాఠశాల హెచ్‌ఎం ఆర్‌వీఎస్ నాగభూషణం, తదితరులు

అల్లిపురం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భూతాపాన్ని తగ్గించాలని మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం ఆర్‌వీఎస్ నాగభూషణం కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం హైస్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ‘భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువు తట్టుకోవడం’ ఈ ఏడాది థీమ్‌గా తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో ఆయన మొక్కలు నాటారు.

అల్లిపురం : పర్యావరణ దినోత్సవాన్ని ఏవీఎన్ కాలేజీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జేసీఐ, మెట్రో, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆకల్య వల్లూరి, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు, జేసీఐ ఉపాధ్యక్షులు మృదుల గోవింద్ మాట్లాడుతూ మొక్కలు నాటితే మన ప్రాణాలు కాపాడుకున్నట్లు అవుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలే ఆధారమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు అధికారి అర్చన, ఎన్‌సీసీ ఆఫీసర్ సునీత, ఆంగ్ల విభాగాధిపతి పైడి రజని పాల్గొన్నారు.



ఏవీఎన్ కళాశాలలో మొక్క నాటుతున్న అతిథులు

క్లాక్ టవర్ పనులు పరిశీలించిన కమిషనర్



క్లాక్ టవర్, సెంటర్ మీడియన్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ



లేపాక్షి జంక్షన్ వద్ద సర్కిల్ నిర్మాణంపై సూచనలు చేస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్ : నగర సుందరీకరణలో భాగంగా జీవీఎంసీ జోన్ – 4 పరిధి జగదాంబ జంక్షన్‌లో నిర్మిస్తున్న క్లాక్ టవర్ పనులు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని కూడళ్ల అభివృద్ధిలో భాగంగా జగదాంబ జంక్షన్‌లో ఆకర్షణీయమైన క్లాక్ టవర్ నిర్మిస్తున్నామన్నారు. పనులు దాదాపు పూర్తయ్యాయని, ఆకర్షణీయమైన రంగులు వేసి అందంగా తీర్చిదిద్ది, మిగిలిన పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జగదాంబ జంక్షన్ రోడ్డు సెంటర్ మీడియన్‌లో ఎత్తుపల్లాలు లేకుండా సమాంతరంగా చేసి ఆకర్షణీయమైన మొక్కలు నాటాలని పర్యవేక్షక ఇంజినీర్ వినయ్ కుమార్‌ను ఆదేశించారు. అనంతరం జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు పరిశీలించారు. లేపాక్షి జంక్షన్ వద్ద వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా సర్కిల్ నిర్మాణ పనులు చేపట్టాలని, అలాగే రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయడంతో పాటు కొత్త రోడ్డు జంక్షన్ వద్ద కల్వర్టు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీరు పీవీవీ సత్యనారాయణరాజును ఆదేశించారు. పర్యటనలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి



మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట: పర్యావరణాన్ని కాపాడుకోలేక పోతే మానవజాతి మనుగడకే ప్రమాదమని నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై జరిగిన కవి సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ గాలి, నీరు నేల పంచభూతాల ను మనిషి కలుషితం చేస్తున్నాడన్నారు. పర్యావరణ సమతుల్యత కోసం అడవుల పరిరక్షణ, మొక్కల పెంపకం జరగాలని, ప్లాసిక్ వస్తువు ల వినియోగం ఆపాలని కోరారు. కార్యక్రమంలో కవులు, రచయితలు కె.జి.వేణు, డి.వి.సూర్యారావు, ఎస్.విజయ్‌కుమార్, చింతా ప్రభాక ర్, చిన సూర్యనారాయణ, కొత్తూరు రమణ తదితరులు పాల్గొన్నారు.

2030 నాటికి 100 మిలియన్ల మొక్కలు నాటడమే లక్ష్యం

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో 2030 నాటికి 100 మిలియన్ల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామని పోర్టు ప్రతినిధులు తెలిపారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి పునరుద్ధరణ, కరువును తట్టుకోవడం అనే అంశాలపై గత నెల 30 నుంచి ఈ నెల 5 వరకూ వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. బీచ్ ఫ్రంట్ క్లీనింగ్‌లో భాగంగా వలంటీర్ల సహకారంతో గంగవరం బీచ్‌ను శుభ్రం చేశారు. అక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఏరివేశారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం గంగవరం పోర్టు పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు.



వేడుకల్లో పాల్గొన్న గంగవరం పోర్టు ప్రతినిధులు

ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుంటాం

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఊపిరి ఉన్నంత వరకు కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు ఎం.రామారావు, డీసీహెచ్.వెంకటేశ్వర్లు అన్నారు. కార్మికుల జీవితాలతో ఆడుకోవాలనుకుంటే కార్మికులతో పాటు రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల సారథ్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షల్లో భాగంగా 1210వ రోజు, బుధవారం శిబిరంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి దేశ ప్రజలు గుణపాఠం నేర్పారన్నారు. ఆరోగ్యకరంగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయాలనుకుంటే ఎవరికైనా ఇదే గతి పడుతుందన్నారు. కార్యక్రమంలో డి.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట, పరిరక్షణ కమిటీ నాయకులు

జిల్లా స్థాయి కథలు, కవితల పోటీలు

పంపించేందుకు గడువు ఈ నెల 15

అగనంపూడి: అగనంపూడికి చెందిన కంచిపాటి గురుమూర్తి మూడో వర్ధంతి సందర్భంగా కథలు, కవితల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులతో పాటు స్మారక పురస్కారాలు అందజేయనున్నట్లు ఆయన కుమారుడు, యువ రచయిత కంచిపాటి వెంకట్ తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనేవారు తమ రచనలను ఈ నెల 15వ తేదీలోగా 94908 05404 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించాలని కోరారు. కథలకు సంబంధించి రచయితలు ఇష్టమైన అంశాన్ని తీసుకోవచ్చని, 8 వందల పదాలకు తగ్గకుండా, 12వందల పదాలకు మించకుండా ఉండేలా చూడాలని తెలియజేశారు. వీలైనంత వరకు తెలుగు భాషను మాత్రమే వాడాలని సూచించారు. కవితల పోటీలకు సంబంధించి సామాజిక అంశాల్లో ఏదైనా ఒక అంశాన్ని తీసుకొని 15 పాదాలకు తగ్గకుండా 25 పాదాలకు మించకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. కథలు, కవితల పోటీల్లో మొదటి ముగ్గురు విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రత్యేక ప్రశంసా బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. రచయితలు తమ రచనలు పంపించేటప్పుడు ఆ పేపరుపై వారి పేరు రాయకూడదని తెలిపారు. దానికి వేరే ధ్రువపత్రం ఇవ్వాల్సి ఉంటుందని, అందులో మాత్రమే రచయిత పేరు, చిరునామా రాయాలని స్పష్టం చేశారు. విజేతలకు ఈ నెల 22వ తేదీన గురుమూర్తి వర్ధంతి సందర్భంగా అగనంపూడి సీడబ్ల్యూసీలో నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామని వివరించారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం ,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

నిస్వార్థంగా ప్రజలకు సేవ చేశాం

- ఫలితాలపై అనుమానాలున్నాయి
- వైఎస్సార్ సీపీ నాయకులతో వాసుపల్లి గణేష్‌కుమార్



పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : నిరంతరం ప్రజలతోనే ఉంటూ, నిస్వార్థంగా సేవ చేసినప్పటికీ వారు ఆదరించకపోవడం పట్ల చింతిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో బుధవారం తన కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికి ఏ కష్టమొచ్చినా నేనున్నానంటూ ఆదుకున్నానని... కానీ నియోజకవర్గ ప్రజలు ఇంకా ఏదో ఆశించి ఉంటారని, పూర్తి స్థాయిలో వారిని సంతృప్తి పరచలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. తన ప్రతి అడుగులో అడుగేస్తూ నడిపించిన కార్యకర్తలు, నాయకులు, మీడియాకు వాసుపల్లి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. కుటుంబ సభ్యుల కన్నా ప్రజల కోసం ఎక్కువ సమయాన్ని కేటాయించడంతోపాటు వారికి అందుబాటులో ఉన్నప్పటికీ ఓటమి పాలయ్యానన్నారు. ఈ ఫలితాలపై కాస్త అనుమానాలున్నాయని వాసుపల్లి స్పష్టం చేశారు. కూటమి అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మంచి జరిగేలా సేవలు అందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, కార్పొరేటర్లు తోట పద్మావతి, కోడూరు అప్పలరత్నం, చెన్నా జానకీరామ్, మాసిపోగు మేరీజోన్స్, పార్టీ నాయకులు మాసిపోగు రాజు, రామానంద్, అమ్మాజీ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం

సీతమ్మధార : దొండపర్తిలో కొలువుదీరిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో పసుపు నీటితో అభిషేకం నిర్వహించారు. అమ్మవారికి జలాభిషేకం చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. ముందుగా ఆలయ ఈవో రమాబాయి ఆధ్వర్యంలో ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి బిందెలతో పసుపు నీళ్లు తీసుకెళ్లి అభిషేకం చేశారు. ప్రధానార్చకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకం జరిపారు. సాయంత్రం 5 గంటల నుంచి కూడా అమ్మవారికి గంధం నీటితో అభిషేకాలు చేశారు.



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో రమాబాయి, భక్తులు

ఈదురుగాలుల బీభత్సం



తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న దుకాణాల వద్ద చెల్లాచెదురైన సామగ్రి



సత్యం జంక్షన్‌లో ఈదురుగాలులకు చిరిగిన ఫ్లెక్సీలు

సీతమ్మధార: నగరంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఆకాశంలో దట్టమైన మేఘాలు కమ్ముకున్నాయి. తరువాత బలంగా ఈదురుగాలులు వీచాయి. వాటి ప్రభావానికి పలు ప్రాంతాల్లోని దుకాణాల వద్ద గల సామగ్రి చెల్లాచెదురైంది. చెట్లు ఊగిసలాడాయి. సత్యం తదితర జంక్షన్లలో హోర్డింగ్‌ల ఫ్లెక్సీ బ్యానర్లు చిరిగిపోయాయి. చెత్తాచెదారం రోడ్డుపైకి వచ్చేశాయి. కొద్దిపాటి వర్షం పడింది. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా గల నక్కవానిపాలెం దుకాణాల వద్ద ఉన్న సామగ్రి రోడ్డుపైకి చెల్లాచెదురుగా తుళ్లి పడింది. బాలయ్యశాస్త్రి లేఅవుట్, రాధాకృష్ణ లేఅవుట్, బిలాల్ కాలనీ, ఏఎస్సార్ నగర్, రేసపువానిపాలెం, గురుద్వారా పరిసర ప్రాంతాల్లో కొన్ని ప్రైవేట్ కేబుల్ సంస్థలకు చెందిన కేబుల్ వైర్లు రోడ్ల మీద తెగి పడ్డాయి. పార్క్‌చేసిన వాహనాలు సైతం ఈదురుగాలుల దాటికి కి పడిపోయాయి. రాకపోకల సమయంలో వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడ్డారు.

అరుదైన వృక్ష జాతుల నిలయం

- జీవ వైవిధ్య ఉద్యానవనంలో పుష్పాలు కనువిందు
- పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన విద్యార్థులు



ముళ్ల మొక్కపై పుష్పాల కనువిందు



మొక్క నాటుతున్న ప్రకృతి ప్రేమికులు

ఏయూ క్యాంపస్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని స్థానిక జీవ వైవిధ్య ఉద్యానవనంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు.



విరబూసిన మే ఫ్లవర్

జీవ వైవిధ్య ఉద్యానవనాన్ని సరిగ్గా 22 సంవత్సరాల క్రితం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున ప్రారంభించామని నిర్వాహకుడు డాక్టర్ మంథా రామమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా డాల్ఫిన్ నేచర్స్ కన్జర్వేషన్ క్లబ్, యూనిటీ డిగ్రీ కళాశాల, సెయింట్ జోసఫ్ కాలేజ్ ఫర్ విమెన్ సంయుక్తంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాయి. 100 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహగా పాల్గొని ఔషధ మొక్కలను ఉద్యానవనం ప్రాంగణంలో నాటారు. మూడెకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఈ ఉద్యానవనంలో మూడు వేలకు పైగా మొక్కలు పెంచుతున్నారు. నేల మీద, నీటిలో, చెట్లపైన జీవించే మొక్కలు ఇక్కడ కనువిందు చేస్తున్నాయి. ఎడారిలో మాత్రమే పెరిగే ముళ్ల మొక్కలు సైతం వందలాదిగా ఇక్కడ మనంకు దర్శనమిస్తాయి.



ఉద్యానవనంలో వికసించిన పుష్పాలు

కమ్ముకున్న మబ్బులు

ఏయూ క్యాంపస్: మబ్బులు ఆకాశాన్ని కమ్మేశాయి. చల్లని గాలులు ప్రజలను పలకరించాయి. వెచ్చని చినుకులు ఆకాశం నుంచి మనసును తాకాయి. బుధవారం తూర్పు నియోజకవర్గంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. బీచ్ రోడ్డులో దట్టమైన కారుమబ్బులు అలముకున్నాయి. సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడ్డాయి. సాగర తీరాన్ని ఆస్వాదించడానికి వచ్చిన పర్యాటకులు, సందర్శకులు ప్రశాంత వాతావరణాన్ని చూసి తన్మయత్వం చెందారు. తరువాత కొద్ది సేపటికి చినుకులు ప్రారంభమై వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.



బీచ్‌రోడ్డులో కమ్మేసిన మబ్బులు